



హిందూపురంలో బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న మౌలాన అబ్దుల్ మన్నన్

భక్తిశ్రద్ధలతో బక్రీద్

◆ ఈద్గాల్లో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

◆ పలువురి శుభాకాంక్షలు



పండుగు శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఈద్గా మైదానాలకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సర్వమానవాళి శాంతి, సుఖ సంతోషాలతో మెలగాలని కోరుకున్నారు. ప్రార్థనల అనంతరం ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని పంపిణీ చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలసిమెలసి చేసుకోవాలని ఆకాంక్షించారు.

గొర్రెల పెంపకం క్షేత్రంపై నీలినీడలు



◆ కాగితాలకే పరిమితమైన శిక్షణకేంద్రం

◆ వేలల్లో ఉన్న గొర్రెలు..నేడు వందల్లోకి..!

◆ వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత

◆ వందల ఎకరాల భూములు ధారాదత్తం

ప్రజాశక్తి-పెనుకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తర్వాత జీవాల పెంపకంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. అందులో గొర్రెల పెంపకం ముఖ్యమైనది. చాలా మంది దీనిపై ఆధారపడి ఇప్పటికీ సంప్రదాయ పద్ధతిలో గొర్రెల పెంపకాన్ని చేపడుతున్నారు. ఉమ్మడి అనంతలో 49లక్షల గొర్రెలు ఉన్నాయి. 44వేల కుటుంబాలు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. పెరిగిన అవసరాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా గొర్రెల పెంపకంలో రైతులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో రానురాను గొర్రెల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతూ పోతోంది. గొర్రెల పెంపకందారుల కోసం పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. గత ప్రభుత్వంలో శిక్షణకేంద్రానికి రూ.2.50కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రకటన వరకు బాగానే ఉన్నా ఒక్క రూపాయి కూడా అప్పటి ప్రభుత్వం విదిల్చిన దాఖాలాలు లేవు. కేవలం కాగితాలకే ఆ ప్రకటన పరిమితమైంది. కూటమి ప్రభుత్వమైనా గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి చేయూతనందిస్తుందని ఈప్రాంత రైతులు ఆశగా ఉన్నారు.

పెనుకొండలో గొర్రెల పెంపక క్షేత్రం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్న సమయంలో పెనుకొండ సమీపంలో 1959లో 578 ఎకరాల విస్తీర్ణంలో గొర్రెల పెంపక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఆస్ట్రేలియా తరహా వాతావరణం ఉంటుందనే ఉద్దేశంతో ఇక్కడ దానిని నెలకొల్పారు. గొర్రెలకు అవసరమైన షెడ్లు, సిబ్బంది నివాసాలు నిర్మించారు. ఈ భూముల్లోనే గొర్రెలకు గడ్డి సాగు చేసే ఏర్పాటు చేశారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని జీవించే విదేశీ జాతులను ఈ క్షేత్రంలో పెంపకం చేయవచ్చు. ప్రస్తుతం నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెలను ఈ క్షేత్రంలో పెంచుతున్నారు.

శిక్షణ కేంద్రం కాగితాలకే పరిమితం

పెనుకొండలో గొర్రెల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా గతప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించింది. ప్రకటన చేసినా ఐదేళ్లల్లో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాల్లేవు. శిక్షణ కేంద్రం ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వంలోనైనా శిక్షణకేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశగా రైతులున్నారు.



పెనుకొండ షీఫారంలోని గొర్రెలషెడ్లు

గొర్రెల పెంపక క్షేత్రం ఏర్పాటు లక్ష్యం

పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో ఫ్రెంచ్, మెరినో, కరిడేల్, బళ్లారి(డక్కన్) జాతికి చెందిన గొర్రెలను పెంచాలని సంకల్పించారు. వీటితో సంతానోత్పత్తి చేసి ఆ పిల్లలను రైతులకు అమ్మడానికి వీలుగా దీనిని ఏర్పాటు చేశారు. గొర్రెల ద్వారా లభించే ఉన్నితో నాణ్యమైన ఉన్ని వస్త్రాలు తయారు చేయాలని భావించారు. వాతావరణంలో అనూహ్య మార్పులు కారణంగా ఈజాతి గొర్రెలు అభివృద్ధి చెందలేదు. దీంతో నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెల పెంపకం చేపట్టారు.

వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత..

గొర్రెల పెంపక క్షేత్రంలో గతంలో వేలసంఖ్యలో గొర్రెల పెంపకంచేపట్టేవారు. ప్రస్తుతం కేవలం 600 మాత్రమే ఉన్నాయి. 8 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం డీడీ, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు, మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. గొర్రెలను మేపడానికి 20 మంది దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. గొర్రెలు అనారోగ్యం, వ్యాధుల బారినపడితే చికిత్స అందించేదుకు వైద్యుడు లేరు. ఉన్న వైద్యుడు బదిలీపై వెళ్లి రెండేళ్లు గడుస్తున్న మరో వైద్యున్ని ప్రభుత్వం నియమించలేదు. మరో పక్క గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు నామామాత్రంగా విడుదల చేస్తోంది. దీంతో లక్ష్య సాధనకు అమడదూరంలో ఈ గొర్రెల పెంపకక్షేత్రం ఉంది. గతంలో గొర్రెల అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడంతో నిధులు విరివిగా ఉండేవి. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో నిధులు కొరత తీవ్రంగా ఉంది. 2015-16లో ఈ క్షేత్రం అభివృద్ధికి రూ.25 లక్షలు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గొర్రెలు, పొట్టేళ్లు కొనుగోలు, షెడ్ల మరమ్మతులు చేపట్టారు.



షీఫాం భూములు

వేలల్లో ఉన్న గొర్రెలు.. నేడు వందల్లోకి..

గొర్రెల పెంపకం క్షేత్రంలో గతంలో గొర్రెలతో కళకళలాడుతుండేది. వేల సంఖ్యలో గొర్రెలు, సిబ్బందితో ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఆదరణ కొల్పోయి కళావిహీనంగా మారిపోయింది. వేల సంఖ్యలో గొర్రెలు ఉండే క్షేత్రం నేడు వందల్లోకి దిగజారిపోయింది. గొర్రెల షెడ్లు, సిబ్బందినివాస గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వందల ఎకరాల భూములు ధారాదత్తం

గొర్రెల పెంపకక్షేత్రానికి సంబంధించి 578 ఎకరాల భూమి ఉంది. అందులో వందల ఎకరాలు ఇతర అవసరరాలు ధారాదత్తం చేశారు. దీనిని సంబంధించిన భూమిన ఇతర వాటికి కేటాయించడం చూస్తే షీఫారం అభివృద్ధిపైఏమాత్రం చొరవ ఉందో అర్థమౌతుంది. వైద్య కళాశాలనిర్మాణంకు 58 ఎకరాలు, యంఏజీ లేఅవుట్‌కు 32 ఎకరాలు, గిరిజన గురుకుల పాఠశాలకు ఆరు ఎకరాలు తీసుకున్నారు. ప్రస్తుతం పెనుకొండ పరిధిలో ఏ ప్రభుత్వ కార్యాలయాలకు భూమి కావాలన్న ఈ క్షేత్రం భూములనే అధికారులు సిఫార్సు చేస్తున్నారు. ఫలితంగా గొర్రెల పెంపక క్షేత్రం ప్రధాన లక్ష్యం నీరుగారిపోతోంది.



షీఫాంలో ఉన్న గొర్రెలు

అభివృద్ధిపై ప్రభుత్వం స్పందించాలి



గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలి. పూర్తిస్థాయిలో క్షేత్రం అభివృద్ధి అయితే రైతులు, కూలీలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. క్షేత్రం భూమిని ఇతర అవసరాలకు కేటాయింపులు చేయరాదు. ఫలితంగా గొర్రెల పెంపకం కోసం గ్రాసం కొరత రాదు. ఇప్పటికే వందల ఎకరాలు ఇతర అవసరాలకు ప్రభుత్వం కేటాయించింది. అయ్యప్పన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలి. అరకొర గొర్రెల పెంపకం చేయకుండా పూర్తిస్థాయిలో పెంపకం చేపట్టాలి. రైతులకు అవసరమైన గొర్రెపిల్లలను ఉత్పత్తి చేసి అందించాలి.

హరి, ఏపీ రైతుసంఘం నాయకులు.

అప్పు చెల్లించాలని ఇంటికి తాళం

◆ ఆరుబయట పిల్లలతో బాధితురాలు

◆ పోలీసులకు ఫిర్యాదు చేసినా కానరాని ఫలితం

◆ పట్టించుకోని స్థానిక ప్రజా ప్రతినిధులు



ఇంటికి తాళం వేయయడంతో నిలువ నీడ లేక తాళం వేసిన ఇంటి ముందు బిడ్డలతో కలిసి కుర్చోన్న గంగమ్మ

ప్రజాశక్తి-హిందూపురం


ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకపోయినా చనిపోయిన వ్యక్తి తన వద్ద అప్పు చేశాడని, దానిని తీర్చాలంటూ ఓ వ్యక్తి ఇంటికి తాళం వేసుకున్నాడు. అప్పు తీర్చాలని ఇంటికి తాళాలు వేసి ఆ కుటుంబ సభ్యులను వీధిన పడేశాడు. ఈ ఘటన హిందూపురం మండల పరిధిలోని గొళాపురంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు కూడా ఈ సంఘటనపై నోరు మెదపకపోవడం గమనార్హం. ఇందుకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోళాపురం గ్రామానికి చెందిన దళిత హనుమప్ప, గంగమ్మలు దంపతులు. హనుమప్ప గత ఐదేళ్ల క్రితం మతి చెందాడు. మండల పరిధిలోని అప్పలకుంటకు చెందిన అంజక్క, ఆమె కుమారుడు సుధాకర్ వద్ద హనుమప్ప వద్ద రూ.50 వేలు అప్పు చేసినట్లు వారు చెబుతున్నారు. అప్పును తీర్చాలని తరచూ వారొచ్చి గంగమ్మను డిమాండ్ చేసేవారు. అప్పునకు సంబంధించి ఆధారాలు చూపించాలని ఆమె కోరినా వారు ఎలాంటి పత్రాలు చూపించలేదు. తన భర్త చనిపోయిన ఐదేళ్ల తర్వాత అప్పు ఇవ్వమని అడగడం ఏమిటంటూ భార్య ప్రశ్నించగా ఆమెపై దౌర్జన్యం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన అంజక్క, ఆమె కుమారుడు సుధాకర్ గంగమ్మ ఇంటి వద్దకు వచ్చి అప్పు తీర్చాలని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పగా పిల్లలతో సహా ఆమెను బయటకు గెంటేసి ఇంటికి తాళాలు వేసుకున్నారు. కట్టుబట్టలతో గంగమ్మ ముగ్గురు పిల్లలతో ఇంటి బయటకు గడుపుతోంది. తనకు జరిగిన అన్యాయంపై బాధిత మహిళ హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పోలీసులు ఈ విషయంపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఓ మహిళ ముగ్గురు పిల్లలతో తన ఇంటి బయట నడిరోడ్డుపై కాలం వెళ్లదీస్తున్నా ఇటు పోలీసులు, అటు ప్రజా ప్రతినిధులు స్పందించక పోవడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మహిళలకు న్యాయం చేసేలా సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-హిందూపురం

బ్రాహ్మణులు అని రంగాల్లో రాణించి, ఉన్నత స్థాయిలో ఉండాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి హెచ్‌కె.మనోహర రావు, ప్రధాన కోశాధికారి పులిపాక ప్రసాద్ ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవ సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని మురళీ దేశాయ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి దోనెపూడి శ్రీవాణి జెండా ఎగురవేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారుతి రావు, రాజేంద్ర ప్రసాద్, కల్లూరు ఆదినారాయణ, శివానందం మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలన్నారు. బ్రాహ్మణ సమాఖ్య పురోభివద్ధి కోసం ఎంతోమంది పెద్దలు కృషి చేశారని, వారి ఆశయ సాధన కోసం ఐకమత్యంతో పనిచేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి మల్లిఖార్జున, జిల్లా ఉపాధ్యక్షులు రామమూర్తి, కార్యవర్గ సభ్యులు సతీష్ కోర్టు వెంకటరమణ, రాఘవేంద్ర, రామకష్ణ, రాజశేఖర్, అనితాలక్ష్మి, సీమ, జి.రవీంద్ర నాథ్, డి.వాసుదేవరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మురళీ దేశాయ్



అత్యాచార నిందితులను శిక్షించాలి

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి -ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి



నిరసన తెలుపుతున్న ఐద్వా, కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో మైనర్ బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టవర్ క్లాక్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. సప్తగిరి సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలుగా మైనర్ బాలికపై 14 మంది పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. నిందితుల వికృత చర్య సమాజానికి సిగ్గు చేటుగా ఉందన్నారు. బాలిక కుటుంబానికి సదరు నిందితుల మద్దతుదారులు బెదిరించి గ్రామం వదలి వెళ్లాలంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. మహిళా మంత్రి, మహిళా ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం విచారకరం అన్నారు. మహిళా హోం శాఖ మంత్రి ఉన్నప్పటికి రాష్ట్రంలో తరుచూ మహిళలు, బాలికలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్నా చర్యలు మాత్రం చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. మైనర్ బాలిక ఘటనను ప్రధాన రాజకీయ పార్టీలు స్వార్థ రాజకీయాలకు వినియోగించడం నీచమైన చర్య అన్నారు. ఈ ఘటనలో ఏ పార్టీ వారు ఉన్నా వారిని శిక్షించాలన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయడం ద్వారా ఇలాంటి దుర్మార్గ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. మద్యాన్ని, పోర్న్ వీడియోలను పూర్తిగా నిషేధించాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, గీత, కెవిపిఎస్ నాయకులు అక్కులప్ప, రాజా, డేవిడ్, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు జయవర్ధన్, సోము తదితరులు పాల్గొన్నారు.

పాశవిక ఘటన : రాంభూపాల్



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో గ్రామంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం అత్యంత పాశవికమైనదని, ఇందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటనకు కారణమైన వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. పేదరికం, సామాజిక వెనుకబాటును అవకాశంగా తీసుకుని దళిత మహిళపై ఆరు నెలలుగా 14 మంది అత్యాచారానికి పాల్పడడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. నిస్సహాయ బాధిత మహిళకు అండగా నిలవాల్సిన సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం నిందితులకే తోడ్పడుతుందని గుర్తించాలన్నారు. ఈ దుర్మార్గ సంఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.



కిటెక్స్ గార్మెంట్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత

ఎపిలో పెట్టుబడులకు 'కిటెక్స్ గార్మెంట్స్' ఆసక్తి

కేరళలోని కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

టెక్స్‌టైల్స్ రంగంలో ప్రపంచ శ్రేణి దిగ్గజ కంపెనీ కిటెక్స్ గార్మెంట్స్ ఎపిలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆ కంపెనీ యాజమాన్యం త్వరలోనే సిఎం చంద్రబాబుతో భేటీ కానుందని వెల్లడించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి సవిత శనివారం సందర్శించారు. అక్కడ తయారవు తున్న దుస్తులను పరిశీలించి, ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం మంత్రి కిటెక్స్ గార్మెంట్స్ ఛైర్మన్ సాబుజాకబ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎపిలో పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్, నీటి సౌకర్యం సహా అన్ని మౌలిక వసతుల కల్పనకు చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్ రంగం అభివద్ధికి తొలి ప్రాధాన్యమిస్తుందన్నారు. ఇటీవలే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ కూడా తీసుకొచ్చింన్నారు. కంపెనీ యాజమాన్యం శ్రీసత్యసాయి జిల్లాలో కిటెక్స్ గార్మెంట్స్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు మంత్రి తెలిపారు. కిటెక్స్ గార్మెంట్ నిర్వహణపై మంత్రి సవిత సంతృప్తి వ్యక్తంచేశారు. ఎపిలో కిటెక్స్ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు మంత్రి సవిత కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆమెతో పాటు ఆ సంస్థ ఎండి సాబుజాకబ్, సిబ్బంది ఉన్నారు.

తిమ్మంపేట వద్ద రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి.. పది మందికి గాయాలు

ముగ్గురి పరిస్థితి విషమం

మృతి చెందిన, గాయపడిన వారంతా వ్యవసాయ కూలీలు



ప్రమాద ఘటన స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తిమ్మంపేట దగ్గర జాతీయ రహదారి 44పై శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన, గాయపడిన వారంతా వ్యవసాయ కూలీలు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గార్లదిన్నె మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు చీని పంట కోత పనులను పూర్తి చేసుకుని శనివారం సాయంత్రం బొలెరో వాహనంలో ఇంటికి బయళ్దేరారు. వాహనం తిమ్మంపేట వద్దకు రాగానే ఎదురుగా బొలేరో వహనాన్ని లారీ ఢీకొంది. ఆ సమయంలో బొలేరో వాహనంలో 30మంది వరకు కూలీలు ఉన్నారు. ఈ ఘటనలో మంగమ్మ(47) వ్యవసాయ కూలీ అక్కడికక్కడే మతి చెందింది. పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. గార్లదిన్నె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : ఓ.నల్లప్ప సిపిఎం జిల్లా కార్యదర్శి.

రోడ్డు ప్రమాదంలో మరణించిన మతుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలి. గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యసేవలు అందించాలి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలి.



చందనను అభినందిస్తున్న హరీష్‌బాబు, క్రికెట్ కోచ్, తదితరులు

జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం బాలిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జిల్లా క్రికెట్ జట్టుకి ధర్మవరం పట్టణానికి చెందిన జెన్నెగోపి చందన ఎంపికైంది. చందన పట్టణంలోని ఆర్‌డిటి స్పోర్ట్స్ సెంటర్‌లో రోజూ ప్రాక్టీస్ చేస్తుంది. ఆమె అండర్-15 బాలికల విభాగంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ నెల్లూరులో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకి ఎంపికైనట్లు ధర్మవరం ఆర్‌డిటి క్రికెట్ కోచ్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చందనను శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, సిబ్బంది కలిసి అభినందించారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి ఉచిత కోచింగ్ సెంటర్లు నిర్వహించడం వల్ల క్రీడల్లో ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారన్నారు. క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి అవకాశం దక్కుతుందని, ఆర్‌డిటి చేస్తున్న కృషి చాలా గొప్పదన్నారు.

బాలికపై అఘాయిత్యం బాధాకరం

నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

బాలికపై అఘాయిత్యం బాధాకరమని, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సవిత తెలిపారు. రామగిరి మండలంలోని కర్నాటక సరిహద్దులో ఉన్న ఓ గ్రామంలో మైనర్ బాలికపై కొందరు అఘాయిత్యం చేసిన సంఘటనపై మంత్రి తీవ్రస్థాయిలో స్పందించారు. నిష్పక్ష పాతంగా వ్యవహరించి నిందితులు ఎంతటివారైనా అరెస్టు చేయాలని ఎస్పీ వి.రత్నను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ అభం శుభం తెలియని బాలిక విషయంలో నీచ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బాలిక విషయంలో వైసిపి నాయకులు చేస్తున్న ప్రచారం దారుణమన్నారు.



కలుషితమైన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

టిడిపి ఆధ్వర్యంలో వార్డుల పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు పట్టణం లోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆయా వార్డులను వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ప్రజలకు తెలిపారు. అలాగే 8, 12, 14, 34 వార్డుల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ఇంటిపై ఉండడం, ఇతర సమస్యలను టిడిపి నాయకులు గుర్తించి విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక పట్టణంలో కొన్ని రోజులుగా చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదని, వార్డుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ఉందని, పార్థసారథి నగర్‌లో తాగునీరు కలుషితమై వస్తుందని, ఆ నీరు తాగి స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని టిడిపి నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ టిడిపి నాయకులతో కలిసి పార్థసారథినగర్‌కు వెళ్లి పైప్‌లైన్‌ను పరిశీలించారు. తాగునీటి పైప్‌లైన్‌ను మార్చాలని కమిషన్ డీఈ వీరేష్, ఫిట్టర్ నాగరాజును ఆదేశించారు. కమిషనర్ వెంట నాయకులు పరిసే సుధాకర్, పురుషోత్తం గౌడ్, కేశగాళ్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

'నమ్మించి మోసం చేశారు.. న్యాయం చేయండి'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నమ్మించి మోసం చేశారు.. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. బాధితులు లెక్కల నాగభూషణం కూతురు పల్లవి, కుమారుడు పవన్ కుమార్ తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతిగ్రామ్‌లో నివాసం ఉంటున్న ఎస్‌వి.సుధాకర్‌బాబు తన భార్య పేరిట ప్రశాంతి గ్రామ్‌లో 10 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న భవనాన్ని మాకు 2025 జనవరి 17వ తేదీ రూ. 2.10 కోట్లకు విక్రయించి రిజిస్టర్ కూడా చేయించారన్నారు. ఆ సమయంలో వారి కుటుంబ సభ్యులందరూ అగ్రిమెంట్‌లో రిజిస్టర్‌లో సంతకాలు చేశారన్నారు. ఆ తర్వాత సుధాకర్‌బాబు కుటుంబ సభ్యులు మా తండ్రి నాగభూషణంను కలిసి మాయ మాటలు చెప్పి నమ్మించి వారు అప్పు ఉన్న వారికి రూ. 1.4 కోట్లకు ప్రో నోట్లు రాయించారన్నారు. ఆ తర్వాత తమ సొమ్మును తిరిగి ఇవ్వాలని కోరితే మేము మీకు ఒక భాగం ఇల్లు మాత్రమే విక్రయించాం మీకు ఎలాంటి అప్పు లేమని అడ్డం తిరుగుతున్నారన్నారు. వారి మాటలు నమ్మి మోసపోయామని న్యాయం చేయాలని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామని, మాకు న్యాయం చేయాలని కోరారు.

సోలార్ బాధితుడికి పరిహారం చెక్కు అందజేత

పావగడ : తాలూకాలోని తిరుమణి గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్.అచ్చ మ్మనహళ్లి గ్రామంలో కొన్ని నెలల క్రితం ఓ ప్రయివేట్ సోలార్ కంపెనీలో అదే గ్రామానికి చెందిన శివయ్య పని చేస్తుండగా జిలెటిన్ స్టిక్స్ పేలి కంటి చూపు కోల్పోయాడు. దీంతో సోలార్ సంస్థ నుంచి వచ్చిన రూ. 5 లక్షల పరిహారం చెక్కును శనివారం ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప సమక్షంలో శివయ్యకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డప్ప, అక్కలప్ప, తదితరులు పాల్గొన్నారు.

వారిది 'వెన్నుపోటు'.. వీరిది 'అభివృద్ధి'..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికార, ప్రతి పక్ష పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిపక్ష వైసిపి ఆధ్వర్యంలో 'వెనుపోటు దినం' నిరసన కార్యక్రమాలను చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అధికార కూటమి పార్టీ ఆధ్వర్యంలో ఏడాది పాలన అభివృద్ధి విజయోత్సవ కార్యాక్రమాలను నిర్వహించి సంబరాలను చేసుకున్నారు. వైసిపి ఆధ్వర్యంలో వెన్ను పోటు దినం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలను చేపట్టారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గ సమన్వయ కర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను గుర్తు చేస్తూ వైసీపీ నాయకులు ప్రసంగించారు. బాబు ష్యూరిటీ ఇస్తే మోసం గ్యారెంటీ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సూపర్-6 అమలు జరగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని విధాలా విఫలమైందని నిరసన గళం విన్పించారు. ప్రతిపక్ష పార్టీ విమర్శలను తిప్పికొట్టేలా కూటమి నేతలు కూడా ఏడాది కాలం లో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. కూటమి స్వర్ణయుగం పాలన పేరుతో అన్ని మండల కేంద్రాల్లో విజయోత్సవ సంబరాలను టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఆధ్వర్యంలో చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ప్రజలకు అందించిన సంక్షేమాన్ని నాయకులు తెలియజేశారు. పింఛన్ వెయ్యి రూపాయల పెంపు, ఉచిత గ్యాస్, నూతన మద్యం, ఇసుక పాలసీ తదితర వాటిని అమలు చేసి ప్రజలకు మేలు చేశామంటూ కూటమి నాయకులు పేర్కొన్నారు. మోసం, వెన్నుపోటుకు కేరాఫ్ జగన్మోహన్‌రెడ్డి అంటూ విమర్శలు గుప్పించారు.

రాజకీయవేడి

ఎప్పటిలాగే ఈ వారం కూడా జిల్లాలో రాజకీయవేడి కన్పించింది. తాడిపత్రి నియోజక వర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వెన్నుపోటు దినంలో పాల్గొనేందుకు ఆయన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి బయల్దేరారు. శాంతిభద్రతల నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు వీల్లేదంటూ పోలీసులు ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. ఈ సమయంలో పెద్దారెడ్డి పోలీసుల పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పోలీసులు ఆయన్ను ఆ కార్యక్రమా నికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇక అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టిడిపి నాయకుడు సుధాకర్ నాయుడు సొంత పార్టీ నాయకులపేనే బాంబు పేల్చాడు. ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు తనను చంపేందుకు కుట్ర చేశారంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పెనుసంచలనం రేపింది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి అధిష్టా నం వెంటనే సుధాకర్ నాయుడుతో పాటు అర్బన్ ముఖ్య నేతలు అందరినీ పిలిపించుకుని మాట్లా డింది. పార్టీకి నష్టం కలిగించే చర్యలు తీసుకోవ డంపై గట్టిగానే నేతలను మందలించినట్లు సమాచారం.

కోవిడ్ కలవరం

జిల్లాను మరోసారి కోవిడ్ కలవరపెట్టింది. ఈ వారంలో ఉమ్మడి జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులు ప్రజలను ఆందోళన కలిగించాయి. అనంతపురం పాతూరు చెందిన గర్భిణి దగ్గు, జలుబు లక్షణాలతో ఉండగా సర్వజన ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయగా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచారు. అదే విధంగా ధర్మవరానికి చెందిన గర్భిణికి ఓ ప్రయివేటు ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. అయితే ఆమెకు మళ్లీ సర్వజన ఆసుపత్రిలో కోవిడ్ టెస్ట్ చేయడంతో నెగిటివ్ వచ్చింది. కోవడ్ కేసులు నమోదు నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-తలుపులు

రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రైతులకు మామిడి, వేరుశనగ పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పులిగొండ్లపల్లి, ఉదుములకుర్తి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన సాంకేతికత, పద్ధతులు, వంగడాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలపై రెడ్డిపల్లి కెవికె శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పంట రకాల ఎంపిక, విత్తనశుద్ధి, సాగులో మెలకువల గురించి వివరించడంతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడి పెట్టుబడి తగ్గించుకోవాలన్నారు. ఎఆర్ఎస్, రేకులకుంట పరిధిలో అవసరం మేరకు సేద్యానికి ఉపయోగించే చిన్న ట్రాక్టర్, పెద్ద ట్రాక్టర్, పరికరాలు అద్దెకు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ఎస్, రేకులకుంట సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి, రెడ్డిపల్లి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధ, ప్రతాప్‌రెడ్డి, ఉద్యానవన అధికారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రసాద్, దినేష్, స్వరూప, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్త

గుడిబండ : పంటల సాగులో రైతులు వైవిధ్యతను ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని రాళ్లపల్లి రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ, మొక్కజొన్న, రాగి పంటల సాగును ముందు పద్ధతులు ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలు పంపిణీ చేశారు. రైతుల అభిప్రాయాలు, సమస్యలు వాటి నివారణ చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏవో వీరనరేష్, ఆర్ఎస్‌కె సిబ్బంది సరిత, జెడ్ బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రి దురుసుగా ప్రవర్తించారనేది అవాస్తవం : తహాశీల్దార్

ప్రజాశక్తి-పెనుకొండ

మంత్రి సవిత అధికారులపై దురుసుగా ప్రవర్తించారని పుకార్లు అవాస్తవమని తహశీల్దార్ శ్రీధర్ స్పష్టం చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఈ నెల 1వ తేదీ పట్టణంలో రేషన్ దుకాణాల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రికి స్వాగతం పలికేందుకు సిఎస్‌డిటి ప్రభావతి పూలబొకే అందించిందన్నారు. బొకే తీసుకున్న మంత్రి సెక్యూరిటీ సిబ్బందికి వెనకకు అందజేసే క్రమంలో కింద పడిందన్నారు. అయితే దీన్ని కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి మంత్రి అధికారులపై దురుసుగా ప్రవర్తించారని ప్రచారం చేస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులపై మంత్రి ఎప్పటికీ దురుసుగా ప్రవర్తించలేదని అధికారిక కార్యక్రమాల్లో సైతం అధికారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఇలాంటి వార్తలు ప్రచారం చేసే ముందు మాతో వివరణ తీసుకుంటే నిజాలు వెలుగులోకి వస్తాయని, తప్పుడు వార్తలు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. తప్పుడు వార్తలు ప్రచారం చేసి అధికారులను ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వోలు తేజ, యశస్విని, బషీర్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది

11న యోగాంధ్రను జయప్రదం చేద్దాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 6:45 నుంచి 7.45 గంటల వరకూ చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేద్దామని ఆర్డీవో మహేష్ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ టిఎస్.చేతన్ హాజరవుతారని తెలిపారు. కలెక్టర్ ప్రసంగంలో యోగా ప్రాధాన్యత, యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తారని తెలిపారు. కావున ప్రజలు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, యోగా శిక్షకులు, నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని యాదవ వీధి, లోనికోట, మార్కెట్ వీధి, బడేసాబ్ వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని కనిశెట్టిపల్లి మాజీ సర్పంచి శివారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఆ గ్రామం వెళ్లి శివారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ చింతకాయల రామన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట సర్పంచి కేశవరెడ్డి, మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు నారాయణ, కార్యవర్గ సభ్యులు వాల్మీకి శంకర్, నరసింహారెడ్డి, కొండారెడ్డి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

ఈద్గాల్లో ముస్లిముల సామూహిక ప్రార్థనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


త్యాగం, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పట్టణంలో ముస్లిములు ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని ముస్లింలు ఉదయమే ఈద్గా మైదానానికి చేరుకొని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండడం, ఇతరుల పట్ల సేవా భావంతో మెలగడ,ం శాంతి సామరస్యాలతో ఉండడమే బక్రీద్ ఇచ్చే సందేశం అని ముత్తవల్లిలు, మత పెద్దలు వివరించారు. ఈ పండుగ సమయంలో ప్రతి ముస్లిం తన శక్తి కొలదీ దానధర్మాలు చేయాలని బోధనలతో వివరించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

కదిరి అర్బన్ : బక్రీద్ పర్వదినం పుర్కరించుకుని శనివారం పట్టణంలోని ఈద్గా మైదానాల్లో ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముతవల్లిలు, మత పెద్దలు పండుగ విశిష్టతను, సందేశాన్ని వినిపించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదానాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తచెరువు : బక్రీద్ పండుగ త్యాగనిరతికి ప్రతీక అని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి కొనియాడారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండడమే బక్రీద్ పండుగ ఇచ్చే సందేశమన్నారు. వారు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తచెరువులో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కొందరు నమాజ్ గుట్టపై ఉన్న ఈద్గాలో, మరికొందరు దర్గా ప్రాంతంలో ఉన్న ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుతున్నారు. అనంతరం పేద ముస్లింలకు ఖుర్బాని పంపిణీ చేశారు. పేదలకు దానధర్మాలు చేశారు.

మడకశిర రూరల్ : పట్టణంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట, రెక్కమాను, మల్లమీద పల్లి, కటారుపల్లి, తూపల్లి, తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



ధర్మవరంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

బత్తలపల్లి : స్థానిక ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఉదయం 9 గంటల నుంచే స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఈద్గా మైదానానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మౌలానా మాట్లాడుతూ స్నేహశీలి, ధర్మానికి ప్రతీక బక్రీద్ పండుగ అని తెలిపారు. ప్రార్థనల సమయంలో ఈద్గాల వద్ద ఎస్ఐ సోమశేఖర్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మదీనా, జామీయా, నూరానీయా మసీదులకు చెందిన ముతవల్లి సులేమాన్, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, మత పెద్దలు, అబ్దుల్ రజాక్ నడిమింటి షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

పావగడ : ప్రవక్త త్యాగాన్ని గుర్తుచేసే పండుగ బక్రీద్ అని హజ్రత్ ఫరీదుల్లా తెలిపారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముస్లింలు స్థానిక జామియా మసీదు నుంచి ఆజం మసీదు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో యూనస్, హిదాయత్, షాకీర్, మున్నా, సాజిద్ రజా, అకీబ్, కలీం పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. కేతిరెడ్డి కాలనీలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముతవల్లిలు బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. తదుపరి ముస్లింలు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. కార్యక్రమంల బాషా, నాగూర్ హుస్సేన్, పఠాన్ బాబూఖాన్, రహీమ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణం, పరిసర ప్రాంతాల్లోని ఈద్గా మైదానాల్లో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలను ఆచరించారు. మౌలానాలు పండుగ విశిష్టతను తెలియజేశారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని మౌలానా అబ్దుల్ మన్నన్ తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అందరు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకష్ణ వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, టిడిపి నాయకులు అమర్నాథ్‌తో పాటు ఇతర నాయకులు ముస్లిములతో కలిసి ప్రార్థనలు చేశారు. జామీయ మసీదు కమిటీ ముతవల్లీ సూరూల్లా, కమిటీ వారితో పాటు వివిధ మసీదు ముతవల్లీలు అందరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రార్థనా స్థలాల వద్ద పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. మసీదులు, ఈద్గాలు, ప్రార్థనా స్థలాలు, ఆయా పరిసరాల్లో ముస్లింలు ప్రార్థనాలు చేస్తున్న సమయంలో ప్రత్యేక నిఘా ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు. బక్రీద్ సందర్భంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. ముఖ్యమైన పట్టణాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచారు.

నేరాలు ఘోరాలు

వైద్యుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామపంచాయతీ మాజీ సర్పంచి హనుమంతరాయప్ప కుమారుడు డాక్టర్ శ్రీనివాసులుపై శనివారం గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. శ్రీనివాసులు రెండేళ్ల క్రితం ఎంబిబిఎస్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ప్రయివేటు ఆసుపత్రిలో ఎముకల విభాగానికి సంబంధించిన డాక్టర్‌గా పని చేస్తున్నారు. అతడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై ఉదయం 11 గంటల సమయంలో మడకశిరకు వెళ్లి చికిత్స చేయించుకుని స్వగ్రామం బయల్దేరాడు. మార్గమధ్యలో రాళ్లపల్లికి సమీపంలోని హంద్రీనీవా కాలువ సమీపంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్డగించారు. ఐరన్ రాడ్లు, మారుణా యుధాలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇంతలో మడకశిర, రాళ్లపల్లి వైపు నుంచి వస్తున్న వాహనాల్లోని వ్యక్తులు గమనించి కేకలు వేయడంతో దుండగులు బైక్‌పై పాపోయారు. స్థానిక యువకులు హుటాహుటిన అతడిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అతడిని హిందూపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో యువకుడిపై మారణాయుధాలతో దాడి చేయడం తీవ్ర కలకలం సృష్టించింది.

స్థలం విషయంలో దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి-కొత్తచెరువు

అనంతపురం నగరానికి చెందిన సాగర్‌రెడ్డిపై శనివారం మాజీ జడ్పిటిసి మహాలక్ష్మి భర్త దాల్‌మిల్లు సూరి తమ అనుచరులతో కలిసి రాడ్లు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు బాధితుడి తల్లి తుమ్మలరెడ్డిగారి సుశీలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాలు.. అనంతపురంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన తుమ్మలరెడ్డిగారి సుశీలమ్మ కుమారుడు సాగర్‌రెడ్డి స్థానిక ధర్మవరం రోడ్డులో ఐదేళ్ల క్రితం సర్వే నెంబర్ 446లో 7.65 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి మొత్తం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడు. ఆ స్థలాన్ని శుభ్రం చేసి కంచె వేస్తుండగా దాల్‌మిల్లు సూరి 20 మంది అనుచరులతో వెళ్లి సాగర్‌రెడ్డిపై రాడ్లు, రాళ్లతో విచక్షణారహితంగా దాడులు చేశారు. అడ్డుకోబోయిన కూలీలు ముత్యాలమ్మ, బాలకృష్ణ, కాశి, మరో ఐదుగురిపై దాడి చేయడంతో వారు గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసులు అక్కడికి వెళ్లి అందరినీ చెదరగొట్టారు. ఆ స్థలం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపడిన వారిని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలే కానీ దాడులు చేయడం సరికాదన్నారు. బాధితులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బేల్దారి ఆత్మహత్య

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని నలిగానహళ్లి గ్రామానికి చెందిన నారాయణప్ప(48) జీవితంపై విరక్తి చెంది ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నారాయణప్ప బేల్దారి పని చేస్తూ జీవనం సాగించే వాడు. రోజూ మద్యం తాగడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని, తిరిగి స్వగ్రామం చేరుకున్నాడు. మధ్యాహ్నం గ్రామానికి సమీపం లోని శివాలయం సమీపంలో చింతమానుకు తన లుంగీతో ఉరి వేసుకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే పట్టణ సిఐ సురేష్, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని జ్వాలాపురం వద్ద డివైడర్లను ఢీకొని ఆటో బోల్తా పడగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంకాలం కడప నగరానికి చెందిన ఆటో డ్రైవర్ గ్రంధే శ్రీనివాసులు కడప నుంచి అనంతపురానికి వస్తుండగా మార్గమధ్యలో జ్వాలాపురం వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్ శ్రీనివాసులకు గాయాలైనాయి. స్థానికులు గమనించి ఆటో డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు.

పారిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



పోలీసుల వద్ద ఉన్న రాజు

తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇంటర్ విద్యార్థిని శనివారం రెండో పట్టణ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన నారాయణస్వామి కుమారుడు రాజు ఇంటర్మీడియట్(ఎంపిసి) పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. అయితే అందులో మంచి ర్యాంకు సాధించకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపానికి గురైన రాజు గత శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోడంతో అతడి తండ్రి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రాజు టీచర్స్ కాలనీలోనే తమ బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి వెళ్లి రాజును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి సిఐ రెడ్డప్ప సమక్షంలో తండ్రి నారాయణస్వామికి క్షేమంగా అప్పగించారు. దీంతో రాజు తల్లిదండ్రులు టూ టౌన్ సిఐ రెడ్డప్పకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎద్దుల బండిని ఢీకొన్న వాహనం

ప్రజాశక్తి-బత్తలపల్లి

వ్యవసాయ పనుల నిమిత్తం ఓ రైతు ఎద్దుల బండిలో వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఓ వాహనం ఢీకొనడంతో రైతుతో పాటు ఎద్దులకు తీవ్ర గాయాలు కాగా, ఎద్దుల బండి పూర్తిగా దెబ్బతినింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం రూరల్ మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రైతు వీరనారప్ప శనివారం తెల్లవారుజామున వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండిలో వేల్పుమడుగు గ్రామానికి బయల్దేరాడు. వేల్పమడుగు సమీపంలోకి రాగానే ధర్మవరం నుంచి బత్తపల్లికి వస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుకవైపు నుంచి ఎద్దుల బండిని ఢీకొనింది. ఈ ప్రమాదంలో రైతు వీరనారప్పతో పాటు ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎద్దుల బండి సైతం పూర్తిగా దెబ్బతినింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతును ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండన్నకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

'నా చేయిపట్టుకుని నడిపించి.. నా జీవన ప్రయాణంలో, కష్టాల్లో తోడున్న నా తండ్రి ధర్మవరపు కొండన్నను ఎప్పటికీ మరువలేనని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం కొండన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే తన తల్లి, సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కొండన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. తండ్రి మరణం అందరి బిడ్డల్లాగే నాకు కూడా తీరని లోటని.. ఆయనను ఎప్పటికీ మరువలేనని అన్నారు. అనంతరం ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కొండన్న ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత